క్లుప్తంగా

నేడు ప్రజాదర్బార్

సీఎస్‌పురం(పామూరు): ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం మండల సర్వసభ్య సమావేశం అనంతరం గ్రీవెన్స్ (ప్రజాదర్బార్) ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కనిగిరిరూరల్: కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పామూరుకు చెందిన ఎం రాజు సతీమణి అనారోగ్యంతో ఒంగోలులో చికిత్స పొందుతుండగా ఫోన్లో పరామర్శించి.. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థికసాయం గురువారం అందచేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన వంతు పూర్తి సహకారం అందించి, అండగా ఉంటానని.. మర్రి రాజుకు ఆర్థిక భరోసా కల్పించారు.

వైద్యం నిమిత్తం రూ.20 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం నగదు అందజేస్తున్న దాతలు

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లాకు చెందిన విద్యార్థిని ముప్పవరపు షైనీ ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రైలుప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఈసందర్భంగా షైనీ వైద్యఖర్చుల నిమిత్తం ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ముప్పవరపు ప్రేమ్ కుమార్, ట్రెజరర్ అబ్రహం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా గురువారం ఆర్థికసాయం నగదును క్షతగాత్రురాలి కుటుంబసభ్యులకు ఎంఈఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచూరి ఏలియా, మహిళాపోలీస్ గూడూరి హరితలు అందజేశారు. కార్యక్రమంలో బెడవాడ ప్రభాకర్, పలువురు ఉన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు, ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర అర్జీలను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. సచివాలయానికి పనులకోసం వచ్చేవారిపట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యలను పరిష్కరించి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు దద్దాలకు ఆహ్వానం



దద్దాలను సన్మానిస్తున్న కమిటీ నాయకులు

కనిగిరిరూరల్: శ్రీరామ భక్త సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని రామాలయం వద్ద నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌కు కమిటీ నాయకులు గురువారం ఆహ్వానం పలికారు. స్థానిక కార్యాలయంలో శ్రీ రామ భక్త సమాజం కమిటీ దద్దాల నారాయణను కలిశారు. అనంతరం శ్రీరామ నవమి ఉత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామభక్త సమాజం కమిటీ నాయకులు దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు తడికమళ్ల వెంకటేశ్వర్లు, వెంగళరావు గుప్తా, వాగిచర్ల వెంకటేశ్వర్లు, కే సురేష్, సుబ్రహ్మణ్యం, జయరాం, పార్టీ సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పల్నాటి భాస్కర్‌రెడ్డి, పార్టీ ఎస్సీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కటికల వెంకట రత్నం, సర్పంచ్ గోడి నారాయణరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ఉలవపాడు: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నోషనల్ ఖాతాలకు సంబంధించి నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభ జరుగుతుందని తెలిపారు. 4వ తేదీన ఉలవపాడు 2వ గ్రామ సచివాలయం, 8న ఉలవపాడు 3వ సచివాలయం, 9న బద్దిపూడి గ్రామ సచివాలయం, 10న భీమవరం 1వ సచివాలయం, 11న భీమవరం, 2వ గ్రామ సచివాలయంలో ఈ సభలు జరుగుతాయని తెలిపారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

నీటి వృథా..తీరని వ్యథ..!

- వృథాగా పోతున్న రామతీర్థం నీరు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాల్ ద్వారా నీరు వృథాగా పోతున్న దృశ్యం



కందుకూరు రోడ్డు సెంటర్‌లో వాల్ ద్వారా వృథాగా పోతున్న నీరు

సింగరాయకొండ: మండలం ఐదు గ్రామాల ప్రజలకు రామతీర్థం రక్షిత మంచి నీటి పథకం నీరు తాగునీటి ఎద్దడిని తీరుస్తుంది. ఈ తాగునీరు సంతనూతలపాడు మండలం రామతీర్థం నుంచి కొండపి, టంగుటూరు మీదుగా ఏర్పాటు చేసిన భారీ పైపులైను ద్వారా దేవిసీఫుడ్స్ సమీపంలోని సంపుకు సరఫరా అవుతాయి. అక్కడి నుంచి మండలంలోని ఐదు గ్రామాలకు విడతల వారీగా ప్రత్యేక పైపు లైను ద్వారా సరఫరా చేస్తారు. ఈ క్రమంలో నీటి సరఫరా చేసేటప్పుడు పైపులైను దెబ్బతినకుండా నిబంధనల ప్రకారం అక్కడక్కడ ఎయిర్‌వాల్స్ ఏర్పాటు చేశారు. ఈ పైపు లైను ఏర్పాటు చేసి సుమారు 5 ఏళ్లు దాటింది. అయితే ఇటీవల ఈ ఎయిర్‌వాల్స్‌కు ఏర్పాటు చేసిన రబ్బరు వాషర్లు దెబ్బతిని నీరు వృథాగా పోతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి వాల్స్ గుండా తాగునీరు వృథాగా పోకుండా తాగునీరు సరఫరా పర్యవేక్షించే అధికారులు చర్యలు తీసుకోవాలని, కానీ అలా జరగకపోవటంతో నీరు వృథాగా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఐదు గ్రామాలకు నీరు సరఫరా..

మండలంలోని సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామాలకు పూర్తిగా, సోమరాజుపల్లి, పాతసింగరాయకొండ, కనుమళ్ల గ్రామాలకు పాక్షికంగా రామతీర్థం నీరు సరఫరా అవుతుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులైను ద్వారా ఆయా గ్రామాలకు నీటి సరఫరా అవుతుంది. అయితే ఈ పైపులైనుకు ఏర్పాటు చేసిన వాల్స్‌కు ఉన్న రబ్బరు వాషర్లు దెబ్బతిని ప్రతిరోజు ద్వారా నీరు వృథాగా పోతున్న ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, కందుకూరు రోడ్డు సెంటర్, డ్రైవర్‌పేట, విద్యుత్ సబ్‌స్టేషన్, కనుమళ్ల రోడ్డు, సోమరాజుపల్లి రోడ్డు, పాతసింగరాయకొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పైపులైను వాల్స్ ద్వారా కొద్దినెలలుగా తాగునీరు వృథాగా పోతూనే ఉంది. ఈ నీటి వృథా కారణంగా నీరు రోడ్డుపై పారుతూ తారు రోడ్డు ధ్వంసమై గుంతలు పడ్డాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని చెప్పే అధికారులు ఈ విధంగా వాల్స్ ద్వారా నీరు వృథాగా పోతుంటే మాత్రం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో కూడా అధికారులు నీటి వృథాను కట్టడి చేయటంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టి రోడ్లు ధ్వంసం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కనిగిరిరూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించి, అనంతరం మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ అధికారులు పట్టణ ప్రజలకు కనీసం తాగు, వాడు నీటి సమస్యను పరిష్కరించడం లేదని, ఇళ్ల స్థలాల సమస్య, రోడ్లు, మురికి నీటి కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. వార్డుల్లోని స్తంభాలకు కనీసం వీధి లైట్లు లేకపోవడంతో ప్రజలు అం ఎకారంలో అవస్థలు పడుతున్నారన్నారు. శివారు కాలనీల్లో కనీస సౌకర్యాలు మృగ్యంగా మారయని ధ్వజమెత్తారు. పాలకులు, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరిని వీడక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ డానియేల్ జోసఫ్‌కు అందచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బషీరా, ప్రసన్న, నరేంద్ర, పిచ్చయ్య, ఏడుకొండలు, ఆదిలక్ష్మీ, రమణమ్మ పాల్గొన్నారు.

516 బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 516 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు 565 బేళ్లను వేలానికి తీసుకురాగా 516 బేళ్లు కొనుగోలు చేసి 49 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.261.94గా నమోదైంది. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు వేలం పరిశీలన

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు గురువారం సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ రైతులంతా మండెలలో మగ్గిన పొగాకునే బేళ్లు కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని సూచించారు. బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు తీసుకువచ్చిన బేళ్లంనిటినీ నో బిడ్స్ లేకుండా కొనుగోలు చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. వేలానికి ఆలకూరపాడు, అనంతవరం, పలేటిపాడు, జయవరం, రావివారిపాలెం గ్రామ రైతులు 496 పొగాకు బేళ్లు తీసుకురాగా అందులో 429 బేళ్లు కొనుగోలు చేయగా 67 బేళ్లు తిరస్కరించారు. అత్యధిక ధర రూ. 280, అత్యల్ప ధర రూ. 240, సరాసరి ధర 240.00గా నమోదైంది వేలంనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇసుక ట్రాక్టర్లు



కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాల ముందు గుండా పోతున్న ఇసుకట్రాక్టర్

సింగరాయకొండ: ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ఇసుక ట్రాక్టర్లతో మండలంలోని కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నందనవనం - కలికవాయ రహదారిలో సుమారు 150కు పైగా ఇసుక ట్రాక్టర్లు తిరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ట్రాక్టరు డ్రైవర్లు ఎక్కువగా యువకులు కావటంతో వీరు పెద్ద పెద్ద స్పీకర్లు పెట్టుకుని సినిమా పాటలు వింటూ ట్రాక్టర్ నిర్లక్ష్యంగా నడుపుతున్నారని వాపోతున్నారు. లౌడ్‌స్పీకర్ల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ట్రాక్టర్ డ్రైవర్లను ప్రశ్నించినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది డ్రైవింగ్ లైసెన్సు లేకుండా అతి వేగంగా ట్రాక్టర్లను నడపడం వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక ట్రాక్టర్లలో లౌడ్ స్పీకర్లు పెట్టకుండా,లైసెన్స్ దారుడు ట్రాక్టరు నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

కొండపి: రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ పి.మురళి అన్నారు. మండలంలోని అనకర్లపూడిలో రీ సర్వేపై తహసీల్దార్ మురళి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా భూములకు సంబంధించిన వివరాలను ఆధార్, ఫోన్ నంబర్, ఫొటోతో తమ భూముల గట్లు చూపించి రీ సర్వే టీంతో సహకరించాలన్నారు. చనిపోయిన పట్టాదారుల వారసులు కుటుంబ బాగాలు పంపిణీ చేసుకొని వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ సర్వే గురించి సహచరులు, బంధువులకు తెలియపరిచి సర్వేలో పాల్గొనాలని సూచించాలని ఆయన రైతులను కోరారు. అనంతరం గ్రామంలో రీ సర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీ సర్వే డీటీ కాశయ్య, మండల సర్వేయర్ రాజు, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్




పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పొన్నలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులతో స్నేహపూర్వంగా మెలగాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సాధారణ తనిఖీలో భాగంగా పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా పోలీసులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా చైతన్యం చేయాలన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు, పేకాట, బెట్టింగ్‌లపై చర్యలు తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. మహిళా పోలీసులు కూడా గ్రామాల్లో, పాఠశాలల్లో బాలకలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించి లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండేలా తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా ఉంచి ఎస్సైకు తెలియజేయాలన్నారు. పోలీసులు సమన్వయంతో పనిచేసి మంచి వాతావరణం ఉండే గ్రామాలను తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఎస్సై అనూక్‌ను ఎస్పీ అభినందించారు. ఆయన వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ సోమశేఖర్ ఉన్నారు.

కొండపి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ని గురువారం సాయంత్రం ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిసరాలల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం మహిళా పోలీసులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి హెల్మెట్లు అందజేశారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కొండపి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్,సిబ్బంది ఉన్నారు.

హనుమంతునిపాడు: పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషను పరిశీలించారు. నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సీఐ ఖాజావలి, ఎస్సై మాధవరావు పాల్గొన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పామూరు: సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న పీ4 సర్వేతో పాటు ఇతర సర్వేలన్నింటిని త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పీఎస్‌లు, డీఏ, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీఓ మాల్యాద్రికి సూచించారు. పని ప్రాంతంలో కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎఫ్‌లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి నవరాత్రి వేడుకలు



విశిష్ట అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత విగ్రహమూర్తులు

పామూరు: స్థానిక కాపువీధిలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా గురువారం రాత్రి అర్చకులు కురిమేటి సాయి సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



చెల్లెమ్మతోటలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

టంగుటూరు: స్థానిక చెల్లెమ్మతోటలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఆరు నెలల క్రితమే విద్యుత్ స్తంభం ఒరిగిందని విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో కాలనీ వాసులే నెల రోజుల క్రితం స్తంభం చుట్టూ సిమెంట్‌తో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అయితే ప్రస్తుతం అది కూడా నెర్రెలు వచ్చింది. దీంతో స్తంభం ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇమ్మడిచెరువు సర్పంచ్ మృతి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని ఇమ్మడి చెరువు గ్రామ సర్పంచ్ తోకల బాలకృష్ణ (34)మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం బెంగళూరులో ఉంటున్న బాలకృష్ణ గురువారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. బాలకృష్ణ మృతికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల తిరుపతి రెడ్డి, నాయకులు ఎలికా నారాయణ, వై నాగూర్ యాదవ్, కటికల వెంకట రత్నం, కాకర్ల వెంకటేశ్వర్లు, పొల్లా సుబ్రహ్మణ్యం, కుప్పన బోయిన వెంకట్రావ్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు తాతపూడి సురేష్, తాతపూడి నానిలు సంతాపం తెలిపారు.

ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

టంగుటూరు: ప్రజలు తమ సమస్యలు అర్జీ రూపంలో అందించిన సమస్యలు త్వరగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వో, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ ఏప్రిల్ 30 లోగా రేషన్‌కార్డుల లబ్ధిదారులకు ఈకేవైసీ పెండింగ్ లేకుండా చే యాలన్నారు. ఎస్‌పీఐ లేఅవుటులో పట్టా పొందిన అనర్హులను గుర్తించి తొలగించాలన్నారు. మ్యూటేషను, కుల, ఆదాయ, ఇతర ధ్రువ పత్రాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని, త్వరలో వాసేపల్లిపాడులో రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీటి శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గోపీనాథ్

కొండపి: బ్యాంకుల, గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రుణాలు తీసుకున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సక్రమంగా చెల్లింపులు చేయాలని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం గోపీనాథ్ అన్నారు. స్థానిక ఏపీజీబీ, ఎస్‌బీఐ బ్యాంక్‌ల్లో గురువారం సీఆర్‌ఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ మేనేజర్ శరత్, సీసీలు కృష్ణారెడ్డి, మల్లికార్జున, రామాంజనేయులు పాల్గొన్నారు.